

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్నవారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

కులాలవారీగా జనగణన జరపండి

- కేంద్రాన్ని కోరుతూ సీఎం స్టాలిన్ తీర్మానం
- ఏకగ్రీవంగా అసెంబ్లీ ఆమోదం

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులాలవారీగా జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రతిపాదించిన ప్రత్యేక తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కులాలవారీ జనగణన జరిపితే బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు వీలవుతుందని పీఎంకే, డీఎంకే, కాంగ్రెస్ తదితర పార్టీలు భావిస్తున్నాయి. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఈ పార్టీలు పలుమార్లు వినతిపత్రాలను కూడా సమర్పించాయి. ఈ నేపథ్యంలో కులాలవారీ జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసేలా స్టాలిన్ బుధవారం ఉదయం శాసనసభలో ప్రత్యేక తీర్మానం ప్రతిపాదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాలవారికీ సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా ద్రావిడ తరహా సుపరిపాలన అందిస్తున్న తమ ప్రభుత్వం అన్ని కులాలవారికీ ఉపాధి అవకాశాలు అందించాలని, సమాన హక్కులు కల్పించాలని, ఆర్థికపరమైన సహాయాలు అందాలని విద్య, ఆర్థిక పరంగా సమాజం అభివృద్ధి చెందాలనే సత్సంకల్పంతో కులగణన త్వరితగతిన ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో ప్రముఖ రాజకీయ పార్టీలన్నీ కులగణనకు మద్దతు పలుకుతున్నాయని, రెండు రోజుల క్రితం శాసనసభలో పీఎంకే శాసనసభ్యుడు జీకే మణి కులాలవారీ జనగణను రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని కోరారని గుర్తు చేశారు. కులాలవారీ గణన జరగాలని పీఎంకేతోపాటు తమ పార్టీ కూడా కోరుకుంటుందని, అయితే ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తేనే అన్ని విధాల సమంజసంగా ఉంటుందన్నారు. జనాభా లెక్కల చట్టం సెక్షన్ 3 ప్రకారం జనగణను కేంద్రమే చేపట్టాల్సి ఉంటుందన్నారు. అయితే భారత రాజ్యాంగ ధర్మాసనం 7 వ షెడ్యూలులో ఉన్న కులాలకుసంబంధించి లెక్కలు సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు వీలుపడదని చెప్పారు. 2008 గణన చట్టం ప్రకారం కులలావారీ జనగణనను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించలేవని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలను 2021లో జరపాల్సి ఉండగా ఇప్పటివరకూ జనగణను నిర్వహించలేదని పేర్కొన్నారు. తొలుత కరోనా లాక్‌డౌన్ కారణంగా చూపిన కేంద్రం ఆ తర్వాత జనగణను నిర్వహించకపోవడం గర్హనీయమన్నారు. జన గణనతోపాటు కులాలవారీ జనగణనన కూడా కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని తమ పార్టీ ఎప్పటి నుండో కోరుతున్నదని, ఈ విషయంలో రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు కూడా సానుకూలతను ప్రకటిస్తున్నాయని స్టాలిన్ వివరించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని వీలైనంత త్వరగా కేంద్రం కులగణనకు శ్రీకారం చుట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



అసెంబ్లీలో కులగణనకు సంబంధించి ప్రత్యేక తీర్మాణాన్ని ప్రతిపాదిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ప్రత్యేక తీర్మానం ఇదే...

ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిపాదించిన ప్రత్యేక తీర్మానంలో దేశ ప్రజలందరికీ విద్య, ఉపాధి, ఆర్థికపరమైన అంశాలలో సమానావకాశాలు కల్పించేందుకు వీలుగా కులగణ నిర్వహించాలని తెలిపారు. అందరికీ అభివృద్ధి ఫలాలు అందేలా కొత్త చట్టాలు చేసేందుకు, కొత్త పథకాలు అమలు చేసేందుకు కులగణన అత్యంత అవసరమన్నారు. ఈ తీర్మానానికి డీఎంకే మిత్రపక్షాలకు చెందిన శాసనసభ్యులు గట్టి మద్దతు ప్రకటిస్తూ ప్రసంగించారు. ఆ తర్వాత తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించినట్లు స్పీకర్ అప్పావు పాలకపక్షం సభ్యుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. ఇదిలా ఉండగా దేశ వ్యాప్తంగా కులాలవారీగా జనగణన చేపట్టాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం సాయంత్రం ప్రత్యేకంగా లేఖ రాసారు.

రాహుల్‌కు స్టాలిన్ శుభాకాంక్షలు

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రధాన ప్రతిపక్షనేతగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న తన ప్రియమైన సోదరుడు రాహుల్‌గాంధీకి ఇండియా కూటమి సాదర స్వాగతం పలుకుతోందన్నారు. రాహుల్ స్వరం ప్రజాసభలో (లోక్‌సభలో) బలంగా గర్జిస్తూనే ఉంటుందని స్టాలిన్ తెలిపారు.

రాజకీయ లబ్ధికోసమే అన్నాడీఎంకే ఆరాటం

- సీఎం స్టాలిన్ ధ్వజం

అడయార్, జూన్ 26: కళ్ళకుర్చి కల్తీ సారా ఘటనను అడ్డుపెట్టుకుని రాజకీయంగా లబ్ధి పొందాలని ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే ఆరాటపడుతుందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ, కళ్ళకుర్చి కల్తీసారా ఘటనకు సంబంధించి ప్రతిపక్షాలు ముఖ్యంగా అన్నాడీఎంకే సభ్యులడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు నుంచే స్పష్టం చేస్తూ వస్తున్నామన్నారు. కానీ అన్నాడీఎంకే ప్రజా సమస్యలపై ఏమాత్రం శ్రద్ధ చూపకుండా సభ నుంచి వాకౌట్ చేస్తూ, రాజకీయలబ్ధి కోసం వెంపర్లాడుతుందని ఆయన ఆరోపించారు. కళ్ళకుర్చి ఘటనపై తమ ప్రభుత్వం ఎంతో శ్రద్ధతో ఆగమేఘాలపై స్పందించి చర్యలు తీసుకుందని ఆయన పేర్కొన్నారు.



రాష్ట్రేతర రిజిస్ట్రేషన్ బస్సుల వ్యవహారం....

ప్రభుత్వ ఉత్తర్వులపై సుప్రీం కోర్టు స్టే

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాలకు చెందిన రిజిస్ట్రేషన్ నెంబర్లు కలిగి ఆలిండియా టూరిస్టు పర్మిట్‌తో ఉన్న ఆమ్నీ బస్సుల సంచారంపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంతవరకూ రాష్ట్రంలో రాష్ట్రేతర రిజిస్ట్రేషన్ నెంబర్లు కలిగిన ఆమ్నీ బస్సులను నడిపేందుకు అనుమతించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. రాష్ట్రేతర రిజిస్ట్రేషన్ నెంబర్లు కలిగి ఆలిండియా టూరిస్టు పర్మిట్‌తో 652 ఆమ్నీ బస్సులు రాష్ట్రంలో నడుపుతున్నారు. వీటిలో 547 బస్సులు రాష్ట్రానికి చెందిన రిజిస్ట్రేషన్ నెంబర్లు పొందకుండా ప్రభుత్వ రవాణా సంస్థకు నష్టం కలిగిస్తున్నాయని ఆ బస్సులపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రేతర రిజిస్ట్రేషన్ నెంబర్లు కలిగిన ఆమ్నీ బస్సుల యజమానులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దానిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకూ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబర్లు కలిగి, ఆలిండియా టూరిస్టు పర్మిట్ కలిగిన బస్సులను గతంలా నడిపేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌కు సంబంధించి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది.

మాజీ మంత్రి విజయభాస్కర్ పరార్

- ఉత్తరాదికి సీబీసీఐడీ అధికారులు



ఎంఆర్ విజయభాస్కర్

అడయార్, జూన్ 26: భూకబ్జా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్‌ను అరెస్టు చేసేందుకు సీబీసీఐడీ అధికారులు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన అజ్ఞాతంలోకి జారుకున్నట్లు తెలిసింది. దీంతో విజయభాస్కర్ కోసం సీబీసీఐడీ అధికారులు గాలిస్తున్నారు. కరూర్ జిల్లా వాంగల్ కుప్పిపాళయం ప్రాంతానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి స్థానిక అన్నాడీఎంకే నాయకుడు. ఈయన ఒక ఎలక్ట్రానిక్ దుకాణం నడుపుతుండగా అతడితో మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్‌కు లావాదేవీలుండేవి. ఈ విషయంలో వారిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ప్రకాష్‌కు చెందిన రూ.100 కోట్ల విలువైన భూమిని బలవంతంగా తన పేరుమీద మాజీ మంత్రి రాయించుకున్నట్టు ఆరోపణలున్నాయి. దీనిపై ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరూర్ నగర పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే, ఈ కేసును సీబీసీఐడీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అదేసమయంలో ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ విజయభాస్కర్ పెట్టుకున్న పిటిషన్‌పై విచారణ జరిపిన కరూర్ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టు పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో విజయభాస్కర్‌ను అరెస్టు చేసేందుకు సీబీసీఐడీ అధికారులు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది.

63కి పెరిగిన కల్తీసారా మృతుల సంఖ్య

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కళ్ళకుర్చి కరుణాపురం ప్రాంతంలో మెథనాల్ కలిపిన కల్తీసారా తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు బుధవారం ఉదయం మృతి చెందారు. దీనితో ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 61 నుండి 63కు పెరిగింది. ఈ నెల 18, 19 తేదీలలో కరుణాపురంలో కల్తీసారా తాగి మొత్తం 225 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం కళ్లకుర్చి, సేలం, విల్లుపురం ప్రభుత్వ ఆసుపత్రులు, పుదుచ్చేరి జిప్‌మర్ ఆసుపత్రి, కళ్ళకుర్చి ప్రైవేటు ఆసుపత్రులలో తరలించారు. వీరిలో చికిత్స ఫలించక కళ్లకుర్చి ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రిలో 32 మంది, పుదుచ్చేరి జిప్‌మర్ ఆసుపత్రిలో ఐదుగుదురు, సేలం ప్రభుత్వ ఆసుపత్రిలో 22 మంది, విల్లుపురం ఆసుపత్రిలో నలుగురు చొప్పున మొత్తం 63 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించారు. ఇక ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నవారిలో 74 మంది డిశ్చార్జి అయ్యారు. ఇంకా 88 మంది చికిత్సలందుకుంటున్నారని తెలిపారు.



అసెంబ్లీ బయట అన్నాడీఎంకే సభ్యుల నిరసన

కళ్లకుర్చి ఘటనపై అసెంబ్లీలో గలభా

- అన్నాడీఎంకే సభ్యుల గెంటివేత
- సమావేశాలు ముగిసేవరకూ సస్పెన్షన్

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటన బుధవారం కూడా అసెంబ్లీని కుదిపేసింది. 60 మందికి పైగా బలి తీసుకున్న ఆ ఘటనపై చర్చ జరపాల్సిందేనని పట్టుబట్టిన అన్నాడీఎంకే సభ్యులను స్పీకర్ బయటకు గెంటివేయించడంతో పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే అన్నాడీఎంకే సభ్యులంతా లేచి.. కళ్లకుర్చి ఘటనపై చర్చించాలంటూ నినాదాలు చేశారు. బుధవారం కూడా నల్లచొక్కాలు ధరించి వచ్చిన ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ చర్చకు పట్టుబట్టారు. వారిని వారించేందుకు స్పీకర్ అప్పావు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అన్నాడీఎంకే సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఎంతటి ప్రధానాంశమైనా ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాతే చర్చకు వస్తుందనే విషయం ప్రధాన ప్రతిపక్షం నేతగా ఉన్న ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కి తెలిసిందేనని, అలాంటప్పుడు ప్రశ్నోత్తరాల సమయాన్ని వాయిదా వేసి తమను మాట్లాడేందుకు అనుమతించాలంటూ పట్టుబట్టడం భావ్యం కాదన్నారు. అన్నాడీఎంకే సభ్యులు సభా వ్యవహారాలకు ఆటంకం కలిగించకుండా వారి సీట్లలో కూర్చోవాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. కళ్ళకుర్చి ఘటనకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ నినాదాలు చేశారు. దీంతో అన్నాడీఎంకే సభ్యులందరినీ సభ నుండి గెంటివేయాలని స్పీకర్ అప్పావు మార్షల్స్‌ను ఆదేశించారు. ఆ మేరకు మార్షల్స్ అన్నాడీఎంకే సభ్యులందరినీ గెంటేశారు. అనంతరం స్పీకర్ అప్పావు మాట్లాడుతూ.. కళ్లకుర్చి ఘటనపై సావధానతీర్మానం ప్రతిపాదించిన అన్నాడీఎంకే సభ్యులు మాట్లాడేందుకు సిద్ధంగాలేరని, సభ నియమ నిబంధనల ప్రకారం ఆ పార్టీ సభ్యులు ప్రవర్తించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కీలకమైన అంశం గురించి సభలో చర్చించేందుకు అన్నాడీఎంకే సభ్యులెవరికీ ఆసక్తి లేదని, సభా కార్యక్రమాలను అదేపనిగా అడ్డుకోవడమే వారి లక్ష్యమన్నారు. సభలో ప్రతిరోజూ గలాభా చేయడానికే వస్తున్న అన్నాడీఎంకే సభ్యుల ప్రవర్తనను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని స్పీకర్ అప్పావు అన్నారు. శాసనసభ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకూ సభలో సభా నియమనిబంధనలు ఉల్లఘించి గలాభా సృష్టించిన అన్నాడీఎంకే సభ్యులందరినీ ఈ సమావేశాలు ముగిసేంతవరకూ సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ... కళ్లకుర్చి ఘటనపై బాధ్యతాయుతమైన ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న అన్నాడీఎంకే సభ్యులు నిర్భయంగా సభలో చర్చించి వుంటే బాగుండేదని చెప్పారు. గత ఐదు రోజులుగా అన్నాడీఎంకే సభ్యులంతా అదే పనిగా సభలో అల్లర్లకు పాల్పడటం గర్హనీయమన్నారు.

పక్షపాతంగా వ్యవహరిస్తున్న స్పీకర్ : ఈపీఎస్

శాసనసభలో స్పీకర్ అప్పావు పాలక పక్షానికి మద్దతుగా, ప్రధాన ప్రతిపక్షానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని అన్నాడీఎంకే సభాపక్షనాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆరోపించారు. శాసనసభ నుంచి అన్నాడీఎంకే సభ్యులందరూ గెంటివేతకు గురైన తర్వాత సచివాలయం బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ... కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనకు సంబంధించి వాస్తవాలు వెలుగులోకి రావాలనే గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. స్పీకర్‌ను తాము గౌరవిస్తున్నామని, అదే సమయంలో ఆయన శాసనసభలో రాజకీయాలు మాట్లాడటం గర్హనీయమన్నారు. అన్నాడీఎంకే సభ్యులను మాట్లాడేందుకు అనుమతించకపోవడం వెనుక గల కారణాలేమిటో స్పీకర్ వెల్లడించాలన్నారు. అన్నాడీఎంకే సభ్యులందరినీ సభ నుండి గెంటి వేసిన తర్వాత తమ గురించి సభలో అదే పనిగా పాలక పక్షం సభ్యులు విమర్శలు చేయడం గర్హనీయమని ఈపీఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు వల్లువర్‌కోట్టం వద్ద అన్నాడీఎంకే నిరాహారదీక్ష

ప్యారీస్, జూన్ 26: కళ్లకుర్చి దుర్ఘటనపై అసెంబ్లీలో మాట్లాడేందుకు అవకాశం కల్పించకపోగా, నిరసన తెలిపిన తమను స్పీకర్ సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ గురువారం నిరహారదీక్ష చేపట్టాలని అన్నాడీఎంకే నిర్ణయించింది. నుంగంబాక్కంలోని వల్లువర్ కోట్టం సమీపంలో నిరాహారదీక్షకు అనుమతి కోరుతూ గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఉదయం పార్టీ నిర్వాహకులు లేఖ సమర్పించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో నిర్వహించనున్న ఈ నిరాహారదీక్షలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రధాన నిర్వాహకులు, జిల్లా కార్యదర్శులు, అన్ని విభాగాల ప్రతినిధులు పాల్గొంటారని అన్నాడీఎంకే ప్రకటించింది.

కళ్లకుర్చి కల్తీసారా సంఘటనపై

జాతీయ మహిళా సంఘం విచారణ





కరుణాపురంలో విచారణ జరుపుతున్న జాతీయ మహిళా సంఘం సభ్యురాలు ఖుష్బూ

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనపై జాతీయ మహిళా సంఘం (ఎన్‌సీడబ్ల్యూ) బుధవారం ఉదయం విచారణ ప్రారంభించింది. కళ్లకుర్చి కరుణాపురంలో ఈ నెల 18, 19 తేదీల్లో మెథనాల్ కలిపిన కల్తీసారా తాగి 61మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసింది. వీరిలో ఆరుగురు మహిళలు కూడా ఉన్నారు. దీనితో ఆ సంఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసుకున్న జాతీయ మహిళా సంఘం ఖుష్బూ నేతృత్వంలో త్రిసభ్య విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కళ్లకుర్చి చేరుకున్న ఖుష్బూ పోలీసు అధికారుల వద్ద విచారణ జరిపి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... మహిళలు కూడా కల్తీసారా తాగే పరిస్థితులు ఉన్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం గర్హనీయమన్నారు. కల్తీసారా తాగినవారిలో ఎక్కువ మంది యువకులేనని చెప్పారు. బాధితులందరికీ రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్య చికిత్స అందిస్తోందని చెప్పారు. కల్తీసారా తాగి కోలుకున్నవారికి సైక్రియాటిస్టుల ద్వారా మానసిక చికిత్సలందించాలని ఆమె కోరారు. కళ్లకుర్చిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కల్తీసారా అమ్మకాలు జరుగకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ వెళ్లిన గవర్నర్



చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి బుధవారం ఉదయం ఆకస్మికంగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ప్రకంపనలు సృష్టించడం, ఆ విషయమై అటు బీజేపీ, ఇటు అన్నాడీఎంకే నేతలు సీబీఐ విచారణ కోరుతూ వినతి పత్రాలు సమర్పించిన నేపథ్యంలో గవర్నర్ ఢిల్లీ వెళ్ళడం కలకలం రేపింది. ఢిల్లీలో ఆయన ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా తదితరులను కలుసుకుంటారని తెలుస్తోంది.

సమాచార దర్శిని

రాష్ట్రీయ బాల పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 26: కేంద్రప్రభుత్వం అందజేసే రాష్ట్రీయ 'బాల' పురస్కారానికి 18 ఏళ్లలోపున్నవారు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై కలెక్టరేట్ సూచించింది. కేంద్రప్రభుత్వం మహిళలు, బాలల సంక్షేమ శాఖ ప్రతియేటా ఈ పురస్కారాన్ని నిస్వార్థంగా ధైర్యసాహసాలు ప్రదర్శించే చిన్నారులకు అభినందిస్తూ అందజేస్తుంది. 5 నుంచి 18 ఏళ్ల లోపున్న అర్హులైన వారు awards.gov.in అనే వెబ్‌సైట్‌లో జూలై 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

నేడు టెన్త్ రీవేల్యూయేషన్ ఫలితాల విడుదల

ఐసిఎఫ్, జూన్ 26: టెన్త్ పరీక్షా ఫలితాల అనంతరం, రీ టోటల్, రీవేల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నవారి మార్కుల్లో మార్పులున్న విద్యార్థుల జాబితాను విద్యాశాఖ గురువారం విడుదల చేయనుంది. www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ ఫలితాలను చూడవచ్చని అధికారులు సూచించారు. రీవేల్యూయేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గురువారం మధ్యాహ్నం 12 గంటల అనంతరం మార్కులు తెలుసుకోవచ్చు. అదే విధంగా సవరించిన మార్కుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

12న సోమేశ్వరాలయ కుంభాభిషేకం

ఐసిఎఫ్, జూన్ 26: సేలం జిల్లా శంకగిరికోట కొండ దిగువన వున్న సోమేశ్వరాలయ కుంభాభిషేకం జూలై 12వ తేదీ జరుగనుంది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వున్న ఈ ఆలయ కుంభాభిషేకం 1994 జూలైలో జరిగింది. 12 ఏళ్ల తరువాత 2006లో జరగాల్సిన కుంభాభిషేకం వివిధ కారణాల వల్ల ఆగిపోయింది. రాజగోపురం నిర్మాణానంతరం కుంభాభిషేకం చేపట్టనున్నట్లు ప్రకటించిన దేవాదాయ శాఖ 2008లో పనులు ప్రారంభించింది. 16 ఏళ్లుగా కొనసాగిన ఆ పనులు ఇప్పుడు పూర్తి కావచ్చాయి. దీంతో జూలై 12వ తేదీన కుంభాభిషేకం జరుగుతుందని అధికారులు ప్రకటించారు.

ఎస్కలేటర్‌తో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు

ఐసిఎఫ్, జూన్ 26: స్థానిక వేళచ్చేరి, కోయంబేడు ప్రాంతాల్లో ఎస్కలేటర్ సౌకర్యంతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నట్లు రహదారుల శాఖ అధికారులు తెలిపారు. వేళచ్చేరి రైల్వే స్టేషన్ బస్టాప్ సమీపంలోని వందడుగుల రోడ్డులో వున్న కోయంబేడు జంక్షన్ సమీపంలో రూ.35.8 కోట్లతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

30న చెస్ పోటీలు

ఐసిఎఫ్, జూన్ 26: స్థానిక తాంబరంలో ఈ నెల 30వ తేదీన చెస్ పోటీలు జరుగనున్నాయి. తమిళనాడు చెస్ సంఘం సహకారంతో వళ్లువర్ గురుకులం పాఠశాలలో ఆనందన్ చెస్ అకాడమీలో 8, 10, 13, 25 ఏళ్ల విభాగాల్లో పోటీలు నిర్వహించనుంది. మొదటి 15 స్థానాలు పొందేవారికి ట్రోఫీలు, మొదటి ఐదు స్థానాలు పొందేవారికి పతకాలు అందజేస్తారు. ఔత్సాహికులు 9710286934, 8610292372 మొబైల్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

తొలిసారి హజ్‌యాత్రకు వెళ్లేవారికి రాయితీ

ఐసిఎఫ్, జూన్ 26: తొలిసారి హజ్ యాత్రకు వెళ్లేవారికి రాయితీ అందజేయనున్నట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి సెంజి మస్తాన్ తెలిపారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 2500 మంది మైనారిటీ మహిళలకు మోటార్ అమర్చిన టైలరింగ్ మిషన్లు కొనుగోలు చేయనున్నామని, తొలిసారిగా హజ్‌కు వెళ్లే అర్హులైన యాత్రీకులకు ఒక్కొక్కరికి రూ.25 వేల రాయితీ ఇస్తామని తెలిపారు.

డీఎంఎస్ డైరెక్టరుగా రాజమూర్తి

ఐసిఎఫ్, జూన్ 26: డీఎంఎస్ వైద్య, గ్రామీణ సంక్షేమ విభాగ డైరెక్టరుగా డాక్టర్ జె.రాజమూర్తి నియమితులయ్యారు. రాష్ట్ర ఈఎస్ఐ ఆస్పత్రుల అదనపు డైరెక్టరుగా వున్న రాజమూర్తికి ఇటీవల డీఎంఎస్ గ్రేడ్ స్థాయిలో పదోన్నతి కల్పించారు. ప్రస్తుతం రాష్ట్ర వైద్య, గ్రామీణ సంక్షేమం డైరెక్టర్‌గా ప్రజా సంక్షేమ శాఖ కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ నియమితులయ్యారు.

రూ.50 కోట్లతో హాస్టళ్లు

ఐసిఎఫ్, జూన్ 26: చెన్నై, మదురై, ధర్మపురి జిల్లాల్లో రూ.50 కోట్లతో కొత్తగా హాస్టల్ భవనాలు నిర్మించనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి రాజకన్నప్పన్ తెలిపారు. శాసనసభలో మంత్రి మాట్లాడుతూ.. 290 కళాశాలలకు చెందిన హాస్టళ్లలో వంటగదులకు వంట పాత్రలు, 692 పాఠశాల హాస్టళ్లకు రూ.1.28 కోట్లతో క్రీడా ఉపకరణాలు కొనుగోలు చేయనున్నామన్నారు.19 పాఠశాలల హాస్టళ్లకు రూ.1.96 కోట్లతో కళాశాల హాస్టళ్లుగా అభివృద్ధి చేయనున్నామని, ప్రైవేటు భవనాల్లో ఉన్న చెన్నై, మదురై, ధర్మపురి జిల్లాల్లోని మూడు కళాశాలల హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించనున్నామని మంత్రి వివరించారు.

30న కుబేర భగవానుడి తిరుకల్యాణం

ఐసిఎఫ్, జూన్ 26: స్థానిక వండలూరు జూ పార్కు సమీపంలోని రత్నమంగళంలో కుబేర భగవానుడి తిరుకల్యాణం ఈ నెల 30వ తేదీ ఉదయం లక్ష్మీ కుబేర ధ్యాన మండపంలో జరుగనుంది. జూలై 7 నుంచి ఆగస్టు 24వ తేదీ వరకు లక్ష్మీ కుబేర ఉత్సవ మూర్తిని తమ నివాసాలకు ఆహ్వానించి, కుబేర పూజలు చేయగోరే భక్తులు 9176006176 మొబైల్ నెంబరులో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

ప్రతిరోజూ 18 కోట్ల లీటర్ల తాగునీరు

ఐసిఎఫ్, జూన్ 26: నగర ప్రజల అవసరాలకు వీరాణం జలాశయం నుంచి ప్రతిరోజూ 18 కోట్ల లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నట్లు చెన్నై మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు. ప్రజల తాగునీటి అవసరాలను పూండి, పుళల్, చోళవరం, కన్నన్‌కోట తేర్వాయ్ కండిగ్రై, సెంబరంబాక్కం, వీరాణం జలాశయాలు పూర్తి చేస్తున్నాయి. అలాగే నిర్లవణీకరణ కేంద్రాల నుంచి ప్రతిరోజూ 106 కోట్ల లీటర్ల తాగునీరు సరఫరా అవుతుంది.వర్షాల కారణంగా ప్రస్తుతం వీరాణం జలాశయం పూర్తి సామర్థ్యమైన 1,465 మిలియన్ ఘనపుటడుగులకు చేరుకుంది. దీంతో నగరానికి రోజుకి 18 కోట్ల లీటర్లు సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కల్వరాయన్ మలైలో ముమ్మర తనిఖీలు

అడయార్, జూన్ 26: కళ్ళకుర్చి జిల్లాలోని కల్వరాయన్‌మలై ప్రాంతాన్ని పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఈ నెల 18వ తేదీ కళ్ళకుర్చిలో కల్తీసారా సేవించి 61 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఈ కల్తీసారా ఘటన రాష్ట్రంతో పాటు దేశాన్ని ఉలికిపాటుకు గురిచేసింది. అయితే, ఈ కల్తీసారాను కల్వరాయన్ మలై ప్రాంతంలో విచ్చలవిడిగా తయారు చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. దీంతో ఈ కొండ ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ అరుణ్ కపిలన్ సారథ్యంలో 50 మందికిపైగా పోలీసులు జల్లెడ పడుతున్నారు.. ఈ జిల్లాలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన తనిఖీల్లో పది మందికిపైగా సారా తయారీ వ్యాపారులను అరెస్టు చేయగా, 250 లీటర్ల సారా స్పిరిట్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.

నామినేషన్ తిరస్కరించారని విద్యుత్ టవర్ ఎక్కిన వృద్ధుడు

● విక్రవాండిలో ఘటన



చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు వేసిన నామినేషన్ తిరస్కరించారనే కోపంతో తిరుచ్చి ఉరయూరు ప్రాంతానికి చెందిన రాజేంద్రన్ (68) అనే వృద్ధుడు విద్యుత్ టవర్ ఎక్కి ఆందోళన జరిపాడు. దీంతో తిరుచ్చి ఎంజీఆర్ విగ్రహం కూడలి ప్రాంతంలో ఉద్రిక్తపరిస్థితులు నెకొన్నాయి. రాజేంద్రన్ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తిరుచ్చి నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయన నామినేషన్‌ను ఎన్నికల అధికారులు అంగీకరించారు. అయితే విక్రవాండి ఎన్నికల్లో సమర్పించిన నామినేషన్‌ను సరైన దస్తావేజులు లేని కారణంగా తిరస్కరించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆరుగంటల సమయంలో రాజేంద్రన్ తిరుచ్చి ఎంజీఆర్ విగ్రహం కూడలి సమీపంలో ఉన్న విద్యుత్ టవర్‌పైకి ఎక్కారు. గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుచ్చి కంటోన్మెంట్ పోలీసులు వెంటనే అగ్నిమాపక సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. సుమారు రెండు గంటల పాటు రాజేంద్రన్‌తో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చర్చించగా రాజేంద్రన్ కిందకు దిగివచ్చారు. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

'ఇల్లం తేడి కల్వి' టీచర్లకు బోధనా బాధ్యతలు

ఐసిఎఫ్, జూన్ 26: 'ఇల్లం తేడి కల్వి' ఉపాధ్యాయులకు మళ్లీ బోధనా బాధ్యత అప్పగించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 2021లో ఇల్లం తేడి కల్వి పథకం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఏడాదికి రూ.200 కోట్లతో విద్యార్థులను ఇళ్ల వద్దే కలుసుకుని, వారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి పైగా పట్టభద్రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కరోనా సమయంలో బోధనకు అంతరాయం కలగడంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం నిలిపివేశారు. దీంతో ఇల్లం తేడి కల్వి పథకం సమన్వయకర్తలుగా వున్న 300 మందికి పైగా ఉపాధ్యాయులు మళ్లీ పని చేసిన పాఠశాలలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ పథకంలో పని చేసిన స్వచ్ఛంద సేవకులు, ప్రత్యేక ప్రణాళిక అమలు, డేటా నమోదుకు బదిలీ అయ్యారు.

మద్యం విక్రయాల పరిశీలకు కమిటీ

ఐసిఎఫ్, జూన్ 26: స్టార్ హోటళ్లు, క్లబ్‌ల్లో మద్యం విక్రయాల పరిశీలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కళ్లకుర్చి జిల్లాలో గత వారం కల్తీ సారా తాగి 60 మందికి పైగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఆ ప్రకారం స్టార్ హోటళ్లు, క్లబ్‌లలో చట్ట వ్యతిరేకమైన మద్యం విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ, మద్యపాన సంయమనం, టాస్మాక్ జిల్లా మేనేజర్, రెవెన్యూశాఖ ఆర్‌డీవోలతో కూడిన ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మత్తు మందు నిర్మూలనపై అవగాహన ర్యాలీ



వేలూరు, జూన్ 26: వేలూరులో మాదకద్రవ్యాల నిర్మూలనపై బుధవారం అవగాహనా ర్యాలీ జరిగింది. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. వేలూరు కోట సమీపంలో వున్న గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీలో ముస్లిం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వెంకటేశ్వర ఉన్నత పాఠశాల, పునిదమేరి ఉన్నత పాఠశాలకు చెందిన 200 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నీలగిరిలో వర్షాలు

● పాఠశాలలకు సెలవు

అడయార్, జూన్ 26: నైరుతి రుతుపవనాల ప్రభావం కారణంగా నీలగిరి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఈ జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ కారణంగా గూడలూరు, పందలూరు, వాల్‌పారై ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మంగళవారం రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమై... అర్థరాత్రి ఒంటి గంట వరకు భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి వరద నీరు పొంగి ప్రవహించింది. అనేక లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. బుధవారం ఉదయానికి కూడా వర్షపు నీరు తగ్గకపోవడంతో పలు ప్రాంతాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

రూ.10, రూ.20 నాణేలు తీసుకోవాల్సిందే

● వేలూరు జిల్లా కలెక్టర్ స్పష్టీకరణ

వేలూరు, జూన్ 26: రిజర్వుబ్యాంకు ముద్రించిన రూ.10, రూ.20 నాణేలు చెల్లుబాటు అవుతాయని, వాటిని తిరస్కరించడం సరి కాదని వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి స్పష్టం చేశారు. ఆయా నాణేలను తీసుకునేందుకు అనేకమంది విముఖత చూపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇది ఏమాత్రం సరి కాదన్నారు. అవి చెల్లుబాటు కాదంటూ వస్తున్న పుకార్లు తప్పుడు ప్రచారమేనన్నారు. దీనిపై ఇప్పటికే రిజర్వు బ్యాంకు సైతం స్పష్టత ఇచ్చిందని కలెక్టర్ వివరించారు.

వేలూరులో డీఎండీకే ఆందోళన




వేలూరు, జూన్ 26: కళ్లకుర్చి జిల్లాలో కల్తీ సారా కారణంగా పలువురు మృతి చెందడాన్ని ఖండిస్తూ డీఎండీకే ఆధ్వర్యంలో వేలూరులో ఆందోళన జరిగింది. వేలూరులోని ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలోని జరిగిన ఈ ధర్నాకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధనశేఖరన్ నేతృత్వం వహించారు. పార్టీ జిల్లా నిర్వాహకులు ఏళుమలై, ధనశేఖరన్, పాండ్యన్, ప్రభాకరన్, సుందరం, మహాలింగం తదితరులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు.

కళ్లకుర్చి కల్తీసారా వ్యవహారం

అన్నాడీఎంకే, పీఎంకే పిటిషన్లపై విచారణ వాయిదా

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశాలివ్వాలని కోరుతూ ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, పీఎంకే దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. కళ్లకుర్చి కరుణాపురంలో కల్తీసారా తాగి 63 మంది ప్రాణాలు కోల్పోయారు. కల్తీసారా వ్యాపారులతో పాలక పక్షం ఎమ్మెల్యేలు, మంత్రులకు, పోలీసు ఉన్నతాధికారులకు సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో ఆ సంఘటనపై సీబీఐ దర్యాప్తు జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటూ అన్నాడీఎంకే న్యాయవాద విభాగం కార్యదర్శి, ఇన్బదురై, పీఎంకే అధికార ప్రతినిధి బాలు హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లు ప్రధాన ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి మహాదేవన్, న్యాయమూర్తి మహమ్మద్ షఫీక్‌తో ధర్మాసనం ఎదుట బుధవారం ఉదయం విచారణకు వచ్చింది. ఆ సందర్భంగా ప్రభుత్వ తరపు న్యాయవాది పీఎస్ రామన్ కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన సమాచారాలతో నివేదిక సిద్ధం చేసిందని, అయితే ఆ నివేదికను కోర్టులో సమర్పించేందుకు కాస్త గడువు ఇవ్వాలని, విచారణ 10 రోజులపాటు వాయిదా వేయాలని కోరారు. అయితే కల్తీసారాకు అరవై మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన స్థితిలో ఆ సంఘటనపై త్వరితగతిన సీబీఐ దర్యాప్తు జరిపితేనే వాస్తవాలు వెల్లడిఅవుతాయని కనుక విచారణను పది రోజులపాటు వాయిదా వేయడం తగదని పీఎంకే పిటిషనర్ బాలు తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఆ తర్వాత ప్రభుత్వ తరపు వాదనలను అనుసరించి హైకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణను జూలై మూడో తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

ఆనైకట్టు నియోజకవర్గంలో అభివృద్ధి పనుల తనిఖీ



వేలూరు, జూన్ 26: వేలూరు జిల్లా ఆనైకట్టు నియోజకవర్గం పళ్లికొండ పంచాయతీ వేంపకాల్‌లో కొత్తగా నిర్మిస్తున్న బస్టాప్, మిడిల్ స్కూల్‌ను ఎమ్మెల్యే ఎ.నందకుమార్, పంచాయతీ కమిటీ అధ్యక్షుడు బాబు తదితరులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వేగవంతం చేయాలని సూచించిన నేతలు.. పలు సలహాలు అందజేశారు.

రూ.3 కోట్లతో పులుల అభయారణ్యాల అభివృద్ధి

ఐసిఎఫ్, జూన్ 26: గూడలూరు, ఆనైమలై పులుల అభయారణ్యాలను రూ.3 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర అటవీశాఖ మంత్రి మదివేందన్ తెలిపారు. తంజావూరు జిల్లా కుంభకోణం ఆనైకరైలో మొసళ్ల సంరక్షణ కేంద్రాన్ని రూ.250 కోట్లతో ఏర్పాటు చేయనున్నామని, గూడలూరు, ఆనమలై పులల అభయారణ్యాలు రూ.3 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని వివరించారు. ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. తమిళనాడుకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత వన్యప్రాణి సంరక్షకుడు డాక్టర్ ఏజేడీ జాన్‌సింగ్ పేరుతో వన్యప్రాణుల సంరక్షణకు ఉత్తమ సహకారం అందించిన వ్యక్తులకు పురస్కారం అందజేస్తామన్నారు. అంతేగాక వారికి రూ.25 లక్షల నగదు బహుమతి కూడా ఇస్తామని మంత్రి ప్రకటించారు.

కాట్పాడిలో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు



వేలూరు, జూన్ 26: వేలూరు జిల్లా కాట్పాడి తాలూకాలో నకిలీ మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇస్తున్నారని, దీనిపై చర్యలు చేపట్టాలంటూ మేటుకులం పంచాయతీ మారుతీనగర్‌కు చెందిన మురుగేశన్ కుమారుడు పళని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మారుతీనగర్‌లోని తన స్థలానికి సంబంధించిన నకిలీ పత్రాలు సృష్టించడంతో పాటు తాను మరణించినట్లుగా మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్ కూడా తయారు చేసి, తద్వారా ఆ స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుడియాత్తంలో పుస్తకాల పంపిణీ



వేలూరు, జూన్ 26: వేలూరు జిల్లా గుడియాత్తం ఆర్ఎస్ నగర్ 14వ వార్డులో బుధవారం తమిళనాడు వెట్రికళగం అధ్యక్షుడు విజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు పుస్తకాలు, ఉపకరణాలు, మిఠాయిలు పంచి పెట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వేల్ మురుగన్, నిర్వాహకులు శ్రీనివాసన్, ఇళంగో, అయ్యప్పగన్, సంతోష్, రాజు, చిన్నతంబి తదితరులు కూడా పాల్గొన్నారు.

కళ్లకుర్చి ఘటనపై న్యాయవాదుల నిరసన



వేలూరు, జూన్ 26: కళ్లకుర్చిలో కల్తీసారా కారణంగా 60 మందికి పైగా మరణించారని, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు బుధవారం నిరసన చేపట్టారు. న్యాయవాదుల సంఘ జిల్లా, వేలూరు విభాగాల కార్యర్శులు, సంఘం అధ్యక్షుడు బాలచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

పాలారుపై చెక్ డ్యామ్ నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలి

● టీటీవీ దినకరన్ డిమాండ్

అడయార్, జూన్ 26: పాలారు నదిపై చెక్ డ్యామ్ నిర్మాణాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ కోరారు. ఇదే విషయంపై ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాలారు నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టనున్నట్టు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించినట్టు మీడియాలో వార్తలు వస్తున్నాయన్నారు. అలాంటి ప్రతిపాదన ఏదైనా ఉంటే విరమించుకోవాలని తమ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ అంశంపై దృష్టిసారించి ఈ చెక్ డ్యామ్ నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మాజీ మంత్రి అన్బళగన్‌కు అస్వస్థత



చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే పాలక్కోడు శాసనసభ నియోజకవర్గం సభ్యుడు, మాజీ మంత్రి కేపీ అన్బళగన్ అస్వస్థతకు గురై నగరంలోని ఆసుపత్రిలో చేరారు. బుధవారం ఉదయం శాసనసభలో కళ్ళకుర్చి కల్తీసారా సంఘటనపై గలాభా సృష్టించినందుకు అన్నాడీఎంకే సభ్యులందరూ గెంటివేతకు గురయ్యారు. ఆ తర్వాత అన్నాడీఎంకే సభ్యులందరూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఛాంబర్‌లో చేరారు. ఆ సమయంలో కేపీ అన్బళగన్‌కు ఉన్నట్టుండి వళ్లంతా చెమటలు పట్టి మూర్ఛిల్లారు. విషయం తెలిసి అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న వైద్యుల బృందం హుటాహుటిన అక్కడికి చేరుకుని అన్బళగన్‌ను పరీక్షించింది. బీపీ అధికం కావటం వల్ల అన్బళగన్ మూర్ఛిల్లారని వైద్యులు తెలిపారు. వెంటనే ఆయనకు ప్రాథమికచికిత్స అందించారు. ఆ తర్వాత ఆయన అసెంబ్లీ నుంచి వెళ్లి తదుపరి చికిత్సల కోసం నగరంలోని ఆసుపత్రిలో చేరారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న మునివెంకటేశ్వర్లు

తిరుమల, జూన్26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. చెన్నైకు చెందిన బాలకృష్ణ సుకుమార్ ఈ విరాళాన్ని అందజేశారు. విరాళం డీడీని మునివెంకటేశ్వర్లు అనే ఉద్యోగి ద్వారా అన్నప్రసాదం డిప్యూటీ ఈవో రాజేంద్రకుమార్‌కు అందజేశారు.

బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో నిందితుడికి 20 యేళ్ళ జైలు

అడయార్, జూన్ 26: బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, దానిని వీడియో తీసి బెదిరించిన యువకుడికి 20 యేళ్ళ జైలు శిక్ష విధిస్తూ కడలూరు జిల్లా పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, జిల్లాలో ఓ ప్రాంతానికి చెందిన 13 యేళ్ళ బాలికను వేంబూరుకు చెందిన జీవా అనే యువకుడు 2023 మార్చి 7వ తేదీ కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అఘాయిత్యాన్ని వీడియో తీసి ఆ తర్వాత బెదిరించేవాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వేప్పూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి జీవాను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ కడలూరు జిల్లా పోక్సో కోర్టులో సాగింది. కేసులోని సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి లక్ష్మి రమేష్ నిందితుడికి 20 యేళ్ళ కఠిన కారాగారశిక్షతో పాటు రూ.70వేల అపరాధ రుసుం విధిస్తూ తీర్పునిచ్చారు.

పలు రైళ్ల రద్దు

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఖరగ్‌పూర్ డివిజన్‌లో మరమ్మతుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. అదే విధంగా అటువైపు వెళ్లే పలు రైళ్లను దారి మళ్లించారు. ఈ మేరకు దక్షిణరైల్వే బుధవారం ప్రకటన విడుదల చేసింది.

రద్దయిన రైళ్ల వివరాలిలా .....

- జూలై 8న బయలుదేరాల్సిన తేదీన సంత్రాగచ్చి-తాంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22841)
- జూలై 10వ తేదీ బయలుదేరాల్సిన తాంబరం - సంత్రాగచ్చి అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22842)
- జూలై 5న బయలుదేరాల్సిన బెంగళూరు - అగర్తల హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (12503)
- జూలై 6న బయలుదేరాల్సిన అగర్తల - బెంగళూరు హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (12504)

దారి మళ్లించిన రైళ్లు...

- ఈ నెల 27, జూలై 4వ తేదీల్లో బయలుదేరే సిల్చర్ - తిరువనంతపురం ఆరోనై ఎక్స్‌ప్రెస్ (12508) అసన్‌సోల్, అద్రా, మిడ్నాపూర్, హిజ్లీ, భద్రక్ మీదుగా నడవనుంది.
- ఈ నెల 27, 29, 30, జూలై 2, 4, తేదీల్లో బయలుదేరే దిబ్రూఘర్ - కన్నియాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504) అసన్‌సోల్, అద్ర, మిడ్నాపూర్, హిజ్లీ, భద్రక్ మీదుగా నడవనుంది.
- జూలై 4, 6 తేదీల్లో బయలుదేరే కన్నియాకుమారి - దిబ్రూఘర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22503) భద్రక్, హిజ్లీ, మిడ్నాపూర్, అద్ర, అసన్‌సోల్ మీదుగా నడవనుంది.
- ఈ నెల 28, జూలై 5 తేదీల్లో బయలుదేరే న్యూ టిన్సుకియా - ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22502) అసన్‌సోల్, అద్ర, మిడ్నాపూర్, హిజ్లీ, భద్రక్ మీదుగా నడవనుంది.
- ఈ నెల 30, జూలై 1, 7 తేదీల్లో బయలుదేరే గువహటి - బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12510) అసన్‌సోల్, అద్ర, మిడ్నాపూర్, హిజ్లీ, భద్రక్ మీదుగా నడవనుంది.
- జూలై 4, 5 తేదీల్లో బయలుదేరే బెంగళూరు - గువహటి ఎక్స్‌ప్రెస్(12509)భద్రక్, హిజ్లీ, మిడ్నాపూర్, అద్ర, అసన్‌సోల్ మీదుగా నడవనుంది.

విక్రవాండి ఉప ఎన్నిక బరిలో 29 మంది

ప్యారీస్, జూన్ 26: విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల బరిలో మొత్తం 29 మంది అభ్యర్థులు తేలారు. ఈ నియోజకవర్గ డీఎంకే ఎమ్మెల్యే పుహళేంది గత ఏప్రిల్ 6వ తేదీన మరణించడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇందులో భాగంగా జూలై 10వ తేదీన ఎన్నిక జరుగనుండగా నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఈ నెల 14న ప్రారంభమై, 21న ముగిసింది. ఇందులో డీఎంకే తరఫున అన్నియూరు శివ, పీఎంకే తరఫున సి.అన్బుమణి, నాంతమిళర్ కట్చి తరఫున డాక్టర్ అభినయ సహా పలువురు స్వతంత్రులు కూడా నామినేషన్లు వేశారు. రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్ సమక్షంలో నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ బుధవారం ఉదయం ముగియగా, బరిలో 29 మంది నిలిచినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

చదువుకోవాలని మందలించినందుకు..

8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

ప్యారీస్, జూన్ 26: బుద్ధిగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారన్న మనస్తాపంతో 8వ తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాంచీపురం జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి... శ్రీపెరంబుదూర్ సమీపంలోని పడప్పై ప్రాంతంలో నివశిస్తున్న రిచర్డ్ కుమారుడు ధోనీ (13) ఆదమాంజేరిలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ధోనీ చదువుపట్ల నిర్లక్ష్యంగా వుంటున్నాడంటూ ఉపాధ్యాయులు ఫిర్యాదు చేయడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ధోనీ మంగళవారం సాయంత్రం ఇంట్లో వున్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. అనంతరం అతని కేకలు విని చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి, అతనిని కేఎంసీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక ధోనీ మరణించినట్లు పోలీసులు తెలిపారు.

రౌడీ హత్య కేసులో ఐదుగురి అరెస్టు

ప్యారీస్, జూన్ 26: రాజధాని నగరం చెన్నైలో పేరుమోసిన రౌడీని హతమార్చిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా వున్నాయి... స్థానిక సైదాపేట మరమలై నగర్ ఫ్లైఓవర్ కింద వున్న అడయార్ చెరువు గట్టున మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి పడివుండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టగా హతుడు సైదాపేటకు చెందిన కరుప్పు ఆకాశ్ అని తేలింది. పేరుమోసిన ఆ రౌడీపై పలు హత్యాయత్నం కేసులు కూడా వున్నట్లు ఎలిసింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన నేరస్తుల కోసం తీవ్రంగా గాలించారు.. ఎట్టకేలకు షోళింగనల్లూరు సమీపంలోని కన్నగినగర్‌కు చెందిన అరుణ్, ఆలందూర్‌కు చెందిన థామస్, దురైపాక్కంకు చెందిన సైమన్, సైదాపేటకు చెందిన అజయ్, రాకేష్ అరెస్టు చేసి, బుధవారం కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

మైలాపూర్‌లో నేపాల్ యువకుడి ఆత్మహత్య

ప్యారీస్, జూన్ 26: స్థానిక మైలాపూర్ భాస్కర్‌పురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేసే నేపాల్‌కు చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి... అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీగా వున్న గణేశ్ (21) మంగళవారం రాత్రి అపార్ట్‌మెంట్‌లోని తన గదిలో విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. దీనిని గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు ఓ ఆస్పత్రి అంబులెన్స్‌ను రప్పించారు. కానీ అప్పటికే అతను మృతి చెందినట్లు ఆ సిబ్బంది స్పష్టం చేశారు. అపార్ట్‌మెంట్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో విద్యుత్ వైరును అతనే పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తేలింది. దీంతో ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

● పశ్చిమబెంగాల్ యువకుడి అరెస్టు

ప్యారీస్, జూన్ 26: సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు అక్రమంగా గంజాయి తరలించిన పశ్చిమబెంగాల్ యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అతడి నుంచి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న హౌరా మెయిల్ నుంచి దిగిన ప్రయాణీకుల లగేజీకి రైల్వే పోలీసులు తనిఖీ చేయగా, ఓ యువకుడి వ్యవహారశైలి అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో అతడి బ్యాగు తనిఖీ చేయగా, గంజాయి బయల్పడింది. అందులో 6 బండిళ్లను స్వాధీనం చేసుకుని, ఆ యువకుడిని అరెస్టు చేశారు. అతను పశ్చిమబెంగాల్‌కు చెందిన రమణ బండల్‌గా గుర్తించారు. అతను హైదరాబాద్ నుంచి గంజాయి తీసుకొచ్చి, నగరంలోని పలువురు ఏజెంట్లకు సరఫరా చేసేందుకు ప్రయత్నించినట్లు తేలింది.

పాలు తాగుతూ ఊపిరాడక శిశువు మృతి

ప్యారీస్, జూన్ 26: స్థానిక పట్టాభిరాంలో పాలు తాగుతున్న సమయంలో పొరబోవడంతో ఊపిరాడక ఏడాది శిశువు మరణించింది. పట్టాభిరాం నెహ్రూ నగర్‌కు చెందిన మణిప్రభు, విజయలక్ష్మి దంపతులకు ఏడాది వయసున్న గిలియశ్రీ అనే పాప వుంది. మంగళవారం సాయంత్రం ఆకలితో ఏడుస్తున్న పసికందుకు విజయలక్ష్మి బాటిల్ ద్వారా పాలు పట్టింది.ఆ సమయంలో పొరబోవడంతో ఊపిరాడక తల్లకిందులైపోయింది. వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆ పసికందు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. దీనిపై పట్టాభిరాం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేపకూరలో మసాలా తగ్గిందన్నందుకు..!

కస్టమర్‌పై వేడి నూనె పోసిన హోటల్ యజమాని అరెస్టు

ప్యారీస్, జూన్ 26: చేపకూరలో సరిగ్గా మసాలా లేదని అసంతృప్తి వ్యక్తం చేసిన వినియోగదారునిపై సలసల కాగే నూనె పోసిన హోటల్ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. చెంగల్పట్టు స్టేషన్ సమీపంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా వున్నాయి... కొరుకుపేటకు చెందిన మదియరసన్ చెంగల్పట్టు ప్రాంతంలో వున్న టాస్మాక్ మద్యం దుకాణం వద్ద ఖాళీ బాటిళ్లు, ప్లాస్టిక్ పేపర్లు ఏరుకుని, తద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం చెంగల్పట్టు రైల్వే వంతెన సమీపంలో టాస్మాక్ దుకాణం సమీపంలో వున్న కుమార్ బిర్యానీ దుకాణానికి వెళ్లిన మదియరసన్.. చేపల వేపుడు కావాలని ఆర్డర్ ఇచ్చాడు. చేపకు దట్టంగా మసాలా, కారం పట్టించాలని సూచించాడు. ఈ వ్యవహారంలో వారిద్దరిమధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహం చెందిన కుమార్ సలసలా కాగుతున్న నూనె . మదియరసన్‌పై పోశాడు. ఇది చూసిన చుట్టుపక్కల వారు మదియరసన్‌ను చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 50 శాతం కాలిన గాయాలతో అతను చికిత్స పొందుతున్నాడు. అతడిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు.. హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి కుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆన్‌లైన్ క్రికెట్ జూదంలో నష్టం

ఫైనాన్స్ ఉద్యోగి ఆత్మహత్య



ప్రకాష్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా తారాపురం సమీపం కామరాజపురంలో ఆన్‌లైన్ క్రికెట్ జూదమాడి లక్షలాది రూపాయలు నష్టపోయిన యువకుడు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కామరాజపురంలో ప్రకాష్ (32), శరణ్యా అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ప్రకాష్ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఆ సంస్థలో రుణాలు తీసుకున్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి రుణ బకాయిలు సకాలంలో వసూలు చేయలేకపోవడంతో ఆ సంస్థ ఆయన జీతంలో కోతపెట్టింది. దీంతో కుటుంబ పోషణకు ప్రకాష్ అప్పులు చేశారు. అప్పుల ఊబిలో నుండి బయటపడేందుకు ఆన్‌లైన్ క్రికెట్ జూదం ఆడి డబ్బు సంపాదించాలనే ఆశ పుట్టింది. దానికి కూడా అందరి వద్దా అప్పులు చేశారు. దీంతో అప్పుల భారం అధికమైంది. ఈ నేపథ్యంలో ప్రకాష్ తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకునేటప్పుడు ప్రకాష్ తానున్న ప్రదేశాన్ని స్నేహితులకు లోకేషన్ షేర్ చేశాడు. వెంటనే అతడి స్నేహితులు వెంటనే ప్రకాష్ ఉన్న చోటుకు వెళ్లగా, నోటిలో నురగలు కక్కుకుని అపస్మారక స్థితిలో పడి ఉన్న ప్రకాష్‌ను చూశారు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం తారాపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందా డు. తారాపురం పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

క్రికెట్ అభిమానులకు శుభవార్త

● మహిళా క్రికెట్ మ్యాచ్ ఉచితంగా వీక్షించే అవకాశం

పెరంబూర్, జూన్ 26: స్థానిక చేపాక్కం చిదంబరం స్టేడియంలో భారత్-దక్షిణాఫ్రికా మహిళా జట్ల మధ్య టెస్ట్ మ్యాచ్, మూడు టి20 పోటీలు జరుగనున్నాయి. ఈ నెల 28 నుంచి జూలై 1వ తేది వరకు జరుగనున్న టెస్ట్ మ్యాచ్‌ను అభిమానులు ఉచితంగా వీక్షించే అవకాశం కల్పించారు. అలాగే, జూలై 5,7,9 తేదీల్లో జరుగనున్న టి20 మ్యాచ్‌లకు టిక్కెట్ ధర రూ.150గా నిర్ణయించినట్లు, అభిమానులు ఈనెల 28వ తేది నుంచి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు పొందవచ్చని తమిళనాడు క్రికెట్ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

10 రోజుల్లో రూ.81.8 కోట్ల వసూలు



● 'మహారాజ'కు విశేష ఆదరణ

అగ్ర నటుడు విజయ్ సేతుపతి నటించిన 50వ చిత్రం 'మహారాజ'. ఈ నెల 14వ తేదీ విడుదలవగా, చిత్రం తొలి ఆట నుంచే సూపర్‌హిట్ టాక్ సొంతం చేసుకుని కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. దీంతో కేవలం పది రోజుల్లో ఏకంగా రూ.81.8 కోట్ల వసూళ్ళను రాబట్టినట్టు నిర్మాణ సంస్థ ప్రకటించింది. 'కురంగు బొమ్మై' చిత్రం ద్వారా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న నితిలన్ స్వామినాథన్ ఈ చిత్రానికి దర్శకుడు. విజయ్ సేతుపతి 50వ చిత్రంగా రూపొందించిన ఈ మూవీలో అనురాగ్ కశ్యప్ ఓ కీలక పాత్ర పోషించగా, నట్టి కుమార్, సింగంపులి, మమతా మోహన్‌దాస్, అభిరామి, మునీష్‌కాంత్, వినోద్ సాగర్ ఇతర పాత్రలను పోషించారు. రూ.20 కోట్ల బడ్జెట్‌తో సుధన్ నిర్మించిన ఈ చిత్రం ఘన విజయం సాధించడంతో పది రోజుల్లో రూ.81 కోట్లకు పైగా వసూలు చేసి రూ.వంద కోట్ల వసూళ్ళ దిశగా సాగుతుంది.

చిత్రజ్యోతి

అర్జున్ దాస్ సరసన అదితి శంకర్?



విలక్షణ నటుడు అర్జున్ దాస్ సరసన ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ కుమార్తె అదితి కథానాయికగా నటించనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. 'ఖైదీ', 'మాస్టర్' వంటి చిత్రాల్లో ప్రతి నాయకుడిగా నటించి, ప్రేక్షకుల మనసులను గెలచుకున్న అర్జున్ దాస్... 'అనీతి', 'రసవాది' వంటి చిత్రాల్లో హీరోగా నటించి ప్రత్యేక గుర్తింపు పొందారు. వైవిధ్య భరితమైన పాత్రలను ఎంచుకుంటూ తన సినీ కెరీర్‌ను కొనసాగిస్తున్న అర్జున్ దాస్‌కు ఇపుడు హీరోగా వరుస అవకాశాలు వస్తున్నాయి. ఇందులో భాగంగా, డెబ్యూ డైరెక్టర్ హాసిం అబ్దుల్ దర్శకత్వంలో నటించనున్నారు. గతంలో 'గుడ్‌నైట్', 'లవర్' వంటి హిట్ చిత్రాలను నిర్మించిన మిలియన్ డాట్స్ సంస్థ నిర్మించనున్న చిత్రంలో అర్జున్ దాస్ సరసన హీరోయిన్‌గా పలువురి పేర్లను పరిశీలించినప్పటికీ చివరకు అదితి శంకర్ పేరును ఖరారు చేసినట్టు సినీ వర్గాల సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలతో త్వరలోనే అధికారిక ప్రకటన చేయనున్నారు.

విజయ్ ఆంటోని చిత్రానికి 'యూఏ' సర్టిఫికెట్

విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన కొత్త చిత్రం 'మళై పిడిక్కాద మణిదన్'కు సెన్సార్ బోర్డు యూఏ సర్టిఫికెట్ మంజూరు చేసింది. ఈ సినిమాకు విజయ్ మిల్టన్ కథ, ఛాయాగ్రహణం సమకూర్చి దర్శకత్వం వహించారు. ఇన్ఫినిటీ వెంచర్స్ బ్యానరుపై కమల్ బోహ్రా, డి. లలిత, పి.ప్రదీప్, పంకజ్ బోహ్రా సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమాను చూసిన సెన్సార్ బోర్డు సభ్యులు.. యూఏ సర్టిఫికెట్ మంజూరు చేశారు. ఇందులో విజయ్ ఆంటోనీ, శరత్ కుమార్, సత్యరాజ్, మేఘా ఆకాష్, డాలి ధనంజయ, మురళీ శర్మ, శరణ్యా పొన్నయ్యన్, తలైవాసల్ విజయ్ తదితరులు నటించారు. విజయ్ ఆంటోనీ, అచ్చు రాజామణి, రాయ్, వాకు మహాన్ సంగీతం సమకూర్చారు. త్వరలోనే విడుదలకు చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




'మళై పిడిక్కాద మణిదన్'లో విజయ్ ఆంటోనీ



వెంగల్ రావు

హాస్య నటుడికి హీరో శింబు ఆర్థిక సాయం

తమిళ చిత్రపరిశ్రమలో హాస్య నటుడిగా గుర్తింపు పొందిన వెంగల్ రావు అనారోగ్యంతో మంచానికే పరిమితమై వైద్య ఖర్చుల కోసం ఎవరైనా ఆర్థిక సాయం చేయాలని ప్రాధేయపడుతున్నారు. ఈ విషయంపై ఆయన ఇటీవల విడుదల చేసిన ఓ వీడియోను చూసిన హీరో శింబు స్పందించారు. వెంగల్ రావుకు వైద్య ఖర్చుల కోసం రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. కోలీవుడ్ ఇండస్ట్రీలో దాదాపు పాతిక సంవత్సరాల పాటు కొనసాగిన వెంగళరావు ప్రముఖ హాస్య నటుడు వడివేలుతో కలిసి అనేక కామెడీ సన్నివేశాల్లో నటించి, ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించారు. కొన్ని కారణాలతో వడివేలు సినిమాలకు దూరం కావడంతో వెంగల్ రావుకు కూడా సినీ అవకాశాలు తగ్గిపోయాయి. అదేసమయంలో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా ఆయనకు పక్షవాతం రావడంతో ఒక కాలు, చెయ్యి పనిచేయడం మానేశాయి. మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో తన దీనస్థితిని వివరిస్తూ ఒక వీడియో విడుదల చేశారు. దీన్ని చూసిన హీరో శింబు రూ.2 లక్షల ఆర్థిక సాయం చేశారు.





సిద్ధమైన అద్దాల వంతెన



ముస్తాబవుతున్న ముఖద్వారం

ముస్తాబవుతున్న విల్లివాక్కం అద్దాల వంతెన

త్వరలో ప్రారంభం

అడయార్, జూన్ 26: స్థానిక విల్లివాక్కం చెరువులో చెన్నై నగర పాలక సంస్థ (కార్పొరేషన్) అద్దాల వంతెన నిర్మించింది. మొత్తం 250 మీటర్ల పొడవుతో నిర్మించిన ఈ వంతెన ప్రారంభోత్సవానికి ముస్తాబవుతుంది. రెండేళ్ళ క్రితం ఈ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే, జాతీయ హరిత ట్రిబ్యునల్ అడ్డు చెప్పడంతో ఈ నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. మొత్తం 39 ఎకరాల విస్తీర్ణం ఉండే విల్లివాక్కం చెరువును 27.5 ఎకరాల విస్తీర్ణంలో చెన్నై కార్పొరేషన్, మరో 11.5 ఎకరాల విస్తీర్ణం మేర చెన్నై మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డులు పర్యవేక్షిస్తున్నాయి. ఈ చెరువులో అమ్యూజ్‌మెంట్ పార్కును చెన్నై కార్పొరేషన్ రూ.27 కోట్లతో నిర్మించతలపెట్టింది. అయితే, అరప్పోర్ ఇయ్యక్కం అనే ఎన్జీవో సంస్థ దీనికి మోకాలొడ్డింది. మొత్తం 214 ఎకరాల విస్తీర్ణంలో ఉండే విల్లివాక్కం చెరువు ఇపుడు కేవలం 39 ఎకరాలకే పరిమితమైందని, దీన్ని చెన్నై నగర వాసుల కోసం పరిరక్షించేందుకు చర్యలు చేపట్టింది. దీనికితోడు ఈ చెరువులో అమ్యూజ్‌మెంట్ పార్కు నిర్మాణానికి గ్రీన్ ట్రిబ్యునల్ అడ్డుచెప్పింది. చెరువు ఆక్రమించి ఎలాంటి పక్కా నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. దీంతో వెనక్కి తగ్గిన చెన్నై కార్పొరేషన్.. చెరువుకు ఎలాంటి హాని కలగకుండా అద్దాల వంతెనను రూ.27 కోట్లతో నిర్మించేందుకు పూనుకుంది. సింగపూర్ మోడల్ తరహాలో సముద్ర మట్టానికి 41 అడుగుల ఎత్తులో గ్లాస్ డోర్ ఎన్‌క్లోజ్డ్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మించారు. ఈ వంతెన స్థిరత్వాన్ని కూడా ఐఐటీ మద్రాస్‌కు చెందిన నిపుణులు పరిశీలించి క్లియరెన్స్ కూడా ఇచ్చారు. అయితే, గత యేడాది కాలంగా హరిత ట్రిబ్యునల్‌లో ఉన్న చిన్న సమస్యల కారణంగా ఈ యేడాది ఏప్రిల్ నెలలోనే ప్రారంభానికి నోచుకోవాల్సిన ఈ వంతెన ఆలస్యం కావడానికి కారణమని కార్పొరేషన్ ప్రత్యేక ప్రాజెక్టుల విభాగం ఉన్నతాధికారులు తెలిపారు. ఈ వంతెనపై ఒకేసారి 50 మంది పాదాచారులు నడిచి వెళ్ళేందుకు వీలుంది. ఈ వంతెనను అన్ని రకాలుగా ముస్తాబు చేసి త్వరలోనే నగర వాసులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్పొరేషన్ అధికారులు దృష్టిసారించారు.

చెన్నైలో సునీతి సాల్మన్ మెమోరియల్ సింపోజియం



సింపోజియం ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

అడయార్, జూన్ 26: వైఆర్ గైటోండే మెడికల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (వైఆర్‌జీఎంఈఆర్ఎఫ్) అనుబంధ విభాగమైన వైఆర్‌జీ కేర్ చెన్నైలో సునీతి సాల్మన్ మెమోరియల్ సింపోజియం ను ప్రారంభించింది. వైఆర్‌జీఎంఈఆర్ఎఫ్ వ్యవస్థాపక ధర్మకర్త పద్మశ్రీ డాక్టర్ సునీతి సోలమన్ ఆరోగ్య సంరక్షణకు చేసిన సేవలకు స్మారకంగా ప్రారంభించడం సంతోషంగా ఉందని వైఆర్‌జీకేర్‌ను ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సింపోజియంలో ఒక చిన్న వీడియో సునీతి సోలమన్ సెంటర్ గురించి వివరిస్తుంది. కొత్త కేంద్రం ఆరోగ్య సంరక్షణ, డ్రైవింగ్ క్లినికల్ ఎక్స్‌లెన్స్‌కు సమానమైన ప్రాపత్యత అందించడానికి వైఆర్‌జీకేర్ మిషన్ రూపొందించినట్టు తెలిపింది.

మంచుపరదాల మాటున ఏర్కాడు



చెన్నై, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో 'పేదల ఊటీ'గా పేరొందిన ప్రముఖ పర్యాటక ప్రాంతం ఏర్కాడు అంతటా బుధవారం వేకువజామున దట్టమైన మంచు ఆవరించింది. దీంతో ఏర్కాడు ఘాట్‌రోడ్డులో వాహనాలన్నీ లైట్లు వేసుకుని వెళ్ళాల్సి వచ్చింది. గత పది రోజులుగా ఏర్కాడు పరిసర ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఏర్కాడులోని పర్యాటక ప్రదేశాలలో చల్లటి వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఏర్కాడు అంతా ఉదయం 9 గంటల వరకు దట్టమైన మంచు అలముకుంది. వాహనచోధకులు దారి తెలియక తంటాలు పడ్డారు. మంచుకు తోడుగా చలిగాలులు కూడా అధికం కావటంతో ప్రజలు ఉదయం 10 గంటల వరకు ఇంటి నుంచి బయటకు రాలేకపోయారు. ప్రస్తుతం ఏర్కాడు అంతటా డిసెంబర్ నెలలాగా చల్లటి వాతావరణం ఏర్పడిందని పర్యాటకులు చెబుతున్నారు.

ఏర్కాడు ఘాట్‌రోడ్డులో ఉదయం ఏడుగంటల సమయంలో దట్టమైన మంచులో లైట్లు వేసుకుని వెళుతున్న వాహనాలు

రాహుల్‌కు విజయ్ అభినందన

అడయార్, జూన్ 26: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, సినీ హీరో విజయ్ అభినందనలు తెలిపారు. లోక్‌సభలో ఇండియా కూటమి తరపున విపక్ష నేతగా ఎంపికయ్యారు. దీంతో రాహుల్‌కు వివిధ పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ క్రమంలో విజయ్ కూడా రాహుల్‌కు విషెస్ తెలుపుతూ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. లోక్‌సభ విపక్ష నేతగా ఎంపికైన రాహుల్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. దేశ ప్రజలకు సేవ చేయాలని కోరుతూ అభినందనలు తెలుపుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

ఒకే రోజు నాలుగు విమాన సర్వీసుల రద్దు

అడయార్, జూన్ 26: చెన్నై - కొలంబో ప్రాంతాల మధ్య నడిచే విమాన సర్వీసుల్లో ఒకే రోజున నాలుగు విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చెన్నై - కొలంబో - చెన్నై ప్రాంతాల మధ్య శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ పలు విమాన సర్వీసులను నడుపుతుంది. అయితే, వీటిలో నలుగు సర్వీసులను ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా నిలిపివేసింది. ఈ విమాన సర్వీసుల్లో ఈ రెండు ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు మాత్రమే కాకుండా, ఆ మార్గం మీదుగా మలేసియా, సింగపూర్, యూఏఈ, ఐరోపా దేశాలకు వెళ్ళే వారు కూడా ఉన్నారు. ఒకే రోజు నాలుగు సర్వీసులను రద్దు చేయడంతో ఈ విమానాల్లో వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే, ఈ విమాన సర్వీసుల రద్దుకుగల కారణాలను శ్రీలంక ఎయిర్‌లైన్స్ వెల్లడించలేదు.

డబ్ల్యూఐటీఎన్ పోటీల్లో హెచ్ఐటీఎస్ టీంకు అగ్రస్థానం

అడయార్, జూన్ 26: డబ్ల్యూటీయూఎన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ కాంపిటిషన్-2024లో హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఏరోస్పేస్ విద్యార్థుల బృందం మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. తద్వారా రూ.1.20లక్షల బహుమతిని గెలుచుకుంది. బ్రిటన్‌లోని బ్రాడ్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రధాన కార్యాలయం కలిగిన వరల్డ్ టెక్నాలజీ యూనివర్సిటీస్ నెట్‌వర్క్, ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టిసారించి, 21వ శతాబ్దానికి సంబంధించిన సమగ్ర సాంకేతికత, ప్రపంచ పౌరసత్వంపై ఏప్రిల్‌లో ఆన్‌లైన్‌లో ఈ పోటీ నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 16 జట్లు పాల్గొనగా హెచ్ఐటీఎస్ విద్యార్థుల బృందం విజేతగా నిలిచింది. రెండో స్థానంలో ఐర్లాండ్‌లోని అట్లాంటిక్ టెక్నలాజికల్ యూనివర్సిటీ చెందిన ఫోస్‌లుమినా టీమ్, మూడో స్థానంలో తైవాన్‌లోని నేషనల్ తైవాన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన లెట్ ఇట్ గో, లెట్ ఇట్ ఫ్లో టీమ్ నిలిచింది. సస్టైనబుల్ డెవలప్‌మెంట్స్ గోల్స్ (ఎస్‌డీజీ) పరిష్కారానికి, సమగ్ర పరిష్కారాలను అమలు చేసే ప్రాజెక్టుల అభివృద్ధి, ప్రదర్శనకు వీలుగా ఈ పోటీలను నిర్వహించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక సంస్థలు ఈ ఈవెంట్‌లో పాల్గొనగా, హెచ్ఐటీఎస్ ప్రపంచ విజేతగా నిలిచింది. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కె.అపరాజిత, ఎస్ఎల్ వాసుదేవ్, ఆష్నా థామస్, బి.శరణ్ రాజ్‌తో కూడిన బృందం మొదట బహుమతి కైవసం చేసుకుంది. దీనిపై హెచ్ఐటీఎస్ ఛాన్సలర్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ సంతోషం వ్యక్తం చేస్తూ, విద్యార్థుల బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



విజేతలు



బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేకదినం సందర్భంగా ప్రదర్శన జరుపుతున్న చెన్నై, వేప్పేరిలోని జైన్ కళాశాల విద్యార్థినులు



బుధవారం ఉధృత అలల కారణంగా సముద్రం ముందుకు దూసుకురావటంతో కోతకు గురైన చెన్నై మెరీనాబీచ్ తీరం



రాష్ట్ర విధాన మండలి మాజీ అధ్యక్షుడు మా.పొ. శివజ్ఞానం 119వ జయంతి సందర్భంగా టి.నగర్‌లోని ఆయన విగ్రహం వద్ద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మంత్రులు సామినాథన్, ఎం.సుబ్రమణ్యం, మేయర్ ఆర్ ప్రియ, ఎమ్మెల్యే డి.వేలు తదితరులు

చెన్నై సచివాలయంలో రాష్ట్రంలో తొట్టతొలి ముద్రణాలయం నెలకొల్పిన సీగన్ పాల్‌కు విగ్రహంతో కూడిన స్మారక మందిరం నిర్మించనున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ధన్యవాదాలు తెలుపుతున్న సెయింట్ లూథరన్ చర్చి బిషప్ డేనియల్ జయరాజ్, జీవరాజ్ గురుక్కుల్, ఛార్లెస్ తదితర క్రైస్తవ మతాధిపతులు

